




"ఏం సుబ్బన్నా! ఇవాళ యింకా బేరం తగిలినట్టు లేదే" అని, నిద్రగన్నేరు చెట్టు నీడలో కూర్చుని చుట్ట కాల్చుకుంటున్న సుబ్బన్నని పలకరించాడు స్టేషను మాస్టరు. ఆయన సాధారణంగా ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడడు. సుబ్బన్న చుట్టముక్క అవతల పారేసి లేచి నుంచుని "ఏదీ! ఇంతవరకూ బాడిగ తగల్లేదు బాబుగారూ? కాసిని మంచినీళ్లిప్పించండి. నాలిక పిడచగట్టుకుపోతున్నది" అన్నాడు.

స్టేషను మాస్టరిచ్చిన మంచినీళ్ళు తాగి సుబ్బన్న మళ్లీ నిద్రగన్నేరు చెట్టు నీడలో కూర్చున్నాడు. కటకటాలకవతల బండి పక్కనే చెట్టు నీడలో సోమరిగా గడ్డిపరకలు కొరుకుతూ పడుకుని ఉన్నది యెద్దు. "ఎండ లిప్పుడే మరీ ఎక్కువగా ఉన్నాయి" అనుకున్నాడు సుబ్బన్న పై పంచె పరుచుకుని పదుం వాలుస్తూ. ఆకాశంలో తెల్లనిమబ్బులు రెండు మూడు ఒకసారి మొగలి పొదలవలె, మరికొంత సేపట్లోనే గుబురుగా పెరిగిన చెట్లవలె రూపాంతరాలు పొందుతున్నాయి. ఒక కాకి—దాహం గొన్నది కాబోలు, నీరసంగా ఎగిరిపోతున్నది. టెలిగ్రాఫ్ తీగలమీద కూర్చుని ఒక బుల్లిపిట్ట రాగాలు తీస్తున్నది. నిద్రగన్నేరు చెట్టు క్రింద మెత్తని పువ్వులు రాలి ఉన్నాయి.

నేలమీద పరిచిన చిన్న పై పంచెమీద ముడుచుకుని పడుకున్నాడు సుబ్బన్న. స్టేషను మాస్టరూ, మరొక పోర్టరూ తప్ప ఆ పరిసరాల్లో మరెవరూ లేరు. దూరంగా కూత వేసుకుంటూ ఏదో గూడ్సుబండి నెమ్మదిగా వస్తున్నది. సుబ్బన్నకు మగతగా నిద్రపడుతూవుండగా రొద చేసుకుంటూ వచ్చి ఆగి అతని నిద్రను చెడగొట్టింది. చేతిలో రెండు జెండాలు పుచ్చుకుని వచ్చిన పోర్టరు సుబ్బన్నను "ఒక పొగాకు పాయ యిట్టా పారెయ్యవయ్యా" అని అడిగాడు.

సుబ్బన్న లేచి కూర్చుని బనియను జేబులోనుంచి ఒక పొగాకు కాడ తీసి అతని చేతి కిచ్చి "ప్యాసింజరు బండి వచ్చే వేళ కాలేదా యింకా?" అని



అడిగాడు పోర్టరు వెళ్లిపోతూ "అబ్బే! అప్పుడే యెక్కడ? ఇంకా గంట గడవాలి. ఎక్స్‌ప్రెస్ వెళ్లిపోవాలిగా" అని జవాబు చెప్పాడు.

సుబ్బన్న పొగాకుతీసి చుట్టచుట్టుకుంటూ కూర్చున్నాడు ఇవాళ పొద్దున్న తన వూరినుంచి స్టేషనుకు వచ్చిన తర్వాత యింతవరకూ బాడిగ లేదు. రెండు ప్యాసింజరుబండ్లు వచ్చి వెళ్లిపోయాయి. అయినా ఆ స్టేషనులో ఒక్క పురుగైనా దిగలేదు. పదిగంటలబండిలో పదిహేనేళ్ల కుర్రాడొకడు దిగాడు కానీ, వాడు "బండి అక్కర్లేదని" చెప్పి నడిచే వెళ్లిపోయాడు. ఒక్కడికోసం బండి కడితే తనకు మాత్రం గిట్టుబాటు కావద్దూ? తగిలితే పెద్ద బేరమే తగలాలి. భార్యాభర్తలూ, నలుగు రైదుగురు పిల్లలూ, పెట్టెలూ బెడ్డింగులూ—యివన్నీ దిగితే యింక కావలసిందేముందీ? ఏ రూపాయన్నరో చేతిలో పడకుండా ఉంటుందా? అయినా, ఇవాళ వట్టిబండి తోలుకుని ఇంటికి వెళ్లక తప్పేట్టు లేదు ఆ స్టేషనులో దిగేవా రెక్కువగా పగటిపూటే దిగుతారు. 'రాత్రిళ్లు బండిదొరక్క యిబ్బందిపడవలసి ఉంటుంద'నే భయంతో పొద్దు గూకిన తర్వాత అక్కడికి చేరే రైళ్లో ఎవరూ ప్రయాణం చెయ్యరు. స్టేషను కెటువైపు వెళ్లినా నాలుగ మైళ్లలోపున వూరే లేదాయిరి.

సుబ్బన్న చుట్టచుట్టుకోవటం పూర్తిచేసి కొనగిల్లి నోట్లో ఉంచుకుని జేబులోనుంచి అగ్గిపెట్టె తీసి వెలిగించుకున్నాడు దూరంగా ఎక్స్‌ప్రెస్ కూత వినిపించింది. దూరానికే యింత దారుణంగా వినిపించే యీ కూత దగ్గరలో ఉన్న వాళ్లని నిజంగా హడలగొడుతుంది క్రమంగా చప్పు డెక్కువై విపరీతమైన వేగంతో దుమ్ము రేపుతూ రైలు పట్టాలను అదరగొడుతూ కన్ను మూసి తెరిచేలోగా వెళ్లిపోయింది ఎక్స్‌ప్రెస్.

సుబ్బన్న చుట్టపొగ వదులుతూ ఆలోచనలో పడ్డాడు. అతనికి యాభై అయిదేళ్లుంటాయి. తలా, గడ్డమూ కనుబొమలూ నెరసినయ్ ఒక నీరుకావిధోవతి మోకాళ్లదాకా కట్టుకుని పైన చేతులున్న బనియను వేసుకుని ఉన్నాడు. "తల్లి కడుపులో ఉండగానే తండ్రిని మింగిన రాక్షసుడ'ని చిన్నతనంలో అందరూ అతన్ని అసహ్యించుకునేవారు. అతని తల్లి కూడా తర్వాత ఎంతో కాలం బ్రతకలేదు. ఆమె చివరిదశలో అప్పటికి ఆరేళ్లవాడయిన సుబ్బన్నను గురించి కుళ్లి కుళ్లి దుఃఖించేది 'తను చస్తే తర్వాత యీ పసివాడి గతిఏమిటా!' అని ఆ మాతృహృదయం క్షోభించిపోయేది. అయినా ఆమెచావును ఎదిరించలేకపోయింది. ఒకనాడు బయటవర్షం ధారలుకట్టి కురుస్తూవుండగా వూరిచివరగాఉన్న ఆపూరింట్లో కొడుకును గురించిన దిగులుతో నిండినఆ కళ్లలోనుంచే

బండి సుబ్బన్న తాను జీవితాంతం కూడబెట్టిన ధనం సద్వినియోగం చెయ్యాలనుకున్నాడు. తీరా చూస్తే ఆ డబ్బులో సగానికి పైగా...

# భ్రష్టయోగి

ఆమె ప్రాణం పోయింది. కనురెప్పలు వాల్చకుండా కట్టెవలె బిగుసుకుపోయినతల్లిని చూసి అతడు భయంతో పక్క యింట్లోకి పరుగెత్తుకుపోయి పెద్దగా ఏడ్చాడు. తర్వాతవర్షం వెలిసింది. అందరూ చేరి తలా ఒక చేయివేసి అంత్యక్రియలు జరిపించారు.

తర్వాత వూరిపెద్దరైతులలో ఒకడైన నాయుడు జాలిపడి ఆరేళ్ల సుబ్బన్నను తన యింట్లోనే ఉంచుకొని తిండి పెడుతూ ఉండేవాడు. మొదట్లో గొడ్లను తోలుకురావటం, గడ్డి కోసుకురావటం, వేళకు యింట్లో అందరికీ పక్కలు వెయ్యటంతో మొదలై క్రమంగా పెద్ద పెద్ద పనులను చెయ్యవలసి వచ్చింది. పద్దెనిమిదేళ్లు నిండేసరికి సుబ్బన్న పెద్ద పాలేరయినాడు. పొలానికి సంబంధించిన బరువులూ, బాధ్యతలూ అతని నెత్తినే పడ్డాయి. అయినా అతడు శ్రమ దాచుకోకుండా పని చేసేవాడు. నాయుడు పెద్దవాడై పోయాడు. ఆయన కొడుకులు 'ఇంగ్లీషు చదువులకని' వూరొదిలి వెళ్లిపోయారు. ఇంట్లో నాయుడూ, అతని భార్యా, అతని ముసలి అక్కగారూ తప్ప మరెవరూ ఉండేవారు కాదు. వాళ్లయినా వార్ధక్యంవల్ల ఎక్కువగా కదిలేవారు కాదు. లంకంత ఆ లోగిలిలో మనుష్యుల అలికిడే ఉండేది కాదు. ఆ నిశ్శబ్దవాతావరణంలో సుబ్బన్న మాత్రం అటూ యిటూ తిరుగుతూ అన్ని పనులూ చేస్తూ ఉండేవాడు ఆతర్వాత కొద్ది నెలల్లోనే నాయుడు, తనకన్నా ముసలివారందరూ అలాగే చావుకోసం నిరీక్షిస్తూ ఉండగా ఒకనాటి తెల్లవారుజామున ఒంటరిగా పడుకునివుండి కన్ను మూశాడు. అప్పటికి ఆయన కొడుకులు ముగ్గురూ 'ఇంగ్లీషు చదువులలో పీకలదాకా మునిగి ఉన్నారు. ఆ చదువులే వాళ్లకు తల్లిదండ్రుల కంటె, పిత్రార్జితమైన ఆస్తికంటె ముఖ్యమైనవేమో! అవే తమను ఉద్ధరిస్తాయని వారనుకున్నారేమో!

వార్త తెలిసి అందరూ వచ్చారు. ఏదీ మిగిలిపోలేదు. అన్నీ అందరి సహకారంతో సక్రమంగానే జరిగిపోయాయి. కాని సుబ్బన్న మాత్రం రోజుల తరబడి ఒంటరిగా సావడిలో కూర్చుని నాయుణ్ణి గుర్తు చేసుకుని దుఃఖించేవాడు. నాయుడు లేని ఇల్లిప్పుడు అతని కళ్లకు శూన్యంగా కనిపిస్తున్నది. నాయుడి కొడుకులు మళ్లీ మామూలుగా చదువులకు వెళ్లిపోయారు. నాయుడి భార్య వాళ్లతో వెళ్లి పట్నంలో ఉండేందుకు వొప్పుకోలేదు. ఆమే, వృద్ధురాలైన నాయుడి అక్కగారితోపాటు ఆ యింట్లోనే ఉండేది.

ఆ తర్వాత అయిదారునెలలకు సుబ్బన్న ఒకనాటి సాయంకాలం యింటికి వస్తూ హఠాత్తుగా నిలబడిపోయాడు. అస్తమిస్తున్న సూర్యుడి కిరణాలు చెరువులో నీళ్లకు బంగారు పూత వేస్తున్నాయి. చెరువు గట్టునే ఉన్న కుంకుడుచెట్టు మీద రకరకాల పక్షులు రొద చేస్తున్నాయి. నడుంమీద నీళ్లతో నిండిన బిందెను ఉంచుకొని కొద్దిగా తడిసిన పచ్చని పాదాలకు అడ్డం వస్తున్న పరికిణీ కుచ్చెళ్లను కుడిచేత్తో కొద్దిగా పైకి పట్టుకుని, మెట్లెక్కి వస్తూ కనిపించింది రత్తమ్మ. సుబ్బన్న అలా నుంచునివుండి ఆలోచనలో పడిపోయాడు. ఆమె అన్న చౌదరిగారి పాలేరు. వాడు సుబ్బన్నకు బాగా తెలుసు. చిన్నతనంలో అందరూ కలిసి ఆడుకుంటూ ఉండేవారు. సుబ్బన్న ఆమెను చివరిసారిగా పన్నెండేళ్ల పిల్లగా ఉండగా చూశాడు. తర్వాత ఆమె మళ్లీ కనిపించనేలేదు. చాలా జాగ్రత్తగా చూస్తే తప్ప గుర్తుపట్టనేలేనంతగా మారిపోయింది. చిన్నప్పుడు చాలా చిలిపిగా ఉండేది. ఇప్పుడా కదలికలలోనే ఒక ఠీవీ, అందమూ, దర్జా కనిపిస్తున్నాయి. ఆమె నడిచి వెడుతూనే సుబ్బన్న వంక ఒక్కసారి చూసింది. ఆ నల్లని కళ్లు అతన్ని గుర్తు పట్టినట్టే అనిపించింది. ఆమె మరు క్షణంలో తల వంచుకుని తన దారిన తాను వెళ్లిపోయింది. సుబ్బన్న ఎన్నో మధురోహలతో తేలియాడుతూ యింటికి వచ్చాడు ఆనాటి రాత్రి ఎన్నో మధురమైన కలలు కన్నాడు.

మర్నాడు సాయంకాలం నిమ్మతోటలో ఒక చెట్టు క్రింద కూర్చుని ఉండగా సుబ్బన్న రత్తమ్మ అన్న నుద్దేశించి, "మీ చెల్లెలొచ్చినట్టుంది కదురా! నిన్న సాయంకాలమే చూశాను. చాలా మారిపోయిందిరా" అన్నాడు. వీరన్న నవ్వి "నిన్న పొద్దుగూకిన తర్వాత చెరువుకు నీళ్లకని పోయి వచ్చి నాతో చెప్పిందిలే. నువ్వక్కడ కనిపించావటగా? ముందు గుర్తు పట్టలేదట, తర్వాత తెలిసిందట" అని గుర్తు తెచ్చుకుని యింటికి రాగానే నాతో చెప్పింది. ఇన్నాళ్లనుంచీ మా మేనత్తగారి యింట్లోనే ఉంది కదురా, అందువల్ల ఎరికలేదు. అక్కడ మా మేనమామ కొడుకుతో మనువు కూడా కుదిరింది. రేపు మాఘమాసంలో ఆ శుభకార్యం కానిచ్చేదామనుకుంటున్నాం" అన్నాడు.

సుబ్బన్న శిలాప్రతిమవలె కూర్చుండిపోయాడు. తర్వాత చాలాసేపు పెదవి కదపలేదు. చీకటి ప్రపంచాన్ని అజ్ఞానం వలె ఆవరించుకుంది ఆకాశంలో నక్షత్రాలు మాత్రం 'మినుకు మినుకు' మంటున్నాయి. సుబ్బన్న చీకటిలో నడిచి, చీకటితో నిండిన యింటికి వచ్చాడు. నాయుడి భార్యకు జ్వరం. ఆమె రెండురోజులనుంచి లేవలేకుండా పడివుంది. నాయుడి అక్కగారికి పగలే చూపు సరిగా ఆనదు. సుబ్బన్న వెళ్లేటప్పటికి ఆమె చీకట్లో తడువుతూ దీపంబుడ్డికోసం వెదుకుతున్నది.

ఆ రాత్రి గాలి కదలటమే మానివేసింది. సుబ్బన్న నడవలో చాపమీద పడుకున్నాడు. అతనికి విపరీతంగా ఉక్క పోస్తున్నది. ఊపిరాడటంలేదు. పైగా దాహంతో నాలుక పిడచగట్టుకు పోతున్నది. అతడు నీరసంగా లేచి బయటికి వచ్చాడు. వళ్లంతా నలగకొట్టినట్టు నొప్పులుగా ఉంది. అతని వొళ్లతనికి తెలియదు. ఎక్కడో ఒక కుక్క ఏడుస్తున్నది. సుబ్బన్న వంటిమీద స్పృహ లేకుండానే ఆ నాలుగు మైళ్లూ నడిచి స్టేషనుకు వచ్చాడు. ఏదో రైలు సిద్ధంగా ఉంది. స్టేషన్లో ఒక కుండలో ఉన్న నీళ్లను కడుపునిండా త్రాగి కదలబోతున్న రైలెక్కాడు

తర్వాత అతడు యుద్ధంలో చేరాడు. రకరకాల వ్యక్తులతో కాలం గడిపాడు. ఆశలూ, మమతలూ, సుఖాలూ, దుఃఖాలూ వేటినీ పట్టించుకోకుండా, చీకూచింతా లేకుండా రోజులు వెళ్లబుచ్చాడు చాలా పర్యాయాలు వెంట్రుకవాసిలో చావును తప్పించుకున్నాడు. యుద్ధం అయిపోయిన తర్వాత అతనికి మారుమూలల ఉన్న చిన్న స్టేషనూ, తన వూరూ, వూరి చివరగా ఉన్న తన యిల్లూ అన్నీ గుర్తుకు వచ్చాయి. అతడికి మార్గాంతరం లేక నెమ్మదిగా బయలుదేరి తన వూరికి వచ్చాడు. ఆ స్టేషనలాగే ఉంది. తన వూరూ లాగే ఉంది. వూరికి పడమటివైపు చివరగా ఉన్న పెద్ద భవంతిని చూసేసరికి అతని కళ్లు ఆర్ద్రములైనాయి. అది నాయుడి యిల్లు. నాయుడి భార్యా, ఆయన అక్కగారూ ఎప్పుడో పోయారు. ఆయన రెండోకొడుకు మాత్రం యిక్కడే ఉండి వ్యవసాయం చేసుకుంటున్నాడు. మిగిలిన యిద్దరూ ఇంగ్లీషు చదువులు చదివి ఏ వంద రూపాయలకో ఎక్కడో అరవ చాకిరీ చేసుకుంటూ ఎవరి క్రిందనో బ్రతుకుతున్నారు.

రెండో సినిమాకు వెళ్ళివచ్చిన ఒకాయన ఎంతకీ నిద్ర రాకపోగా డాక్టరుకి ఫోనుచేసి ఏమండీ డాక్టరుగారూ ఎంతకీ నిద్ర రావటంలేదండీ అని చెప్పాడు. డ్యూటీనుంచి అప్పుడే ఇంటికొచ్చిన డాక్టరుకు కోపం వచ్చింది. సరే ఫోను అలాగే పట్టుకోండి జోల పాడుతాను అన్నాడు.

ఎమ్. అన్నమ్మ (యాసునూరు.)

కంట లొచ్చే సమయంలో మాత్రం సెలవులు పెట్టి అక్కడికి వచ్చి భాగాలకోసం కీచులాడుతుంటూ ఉంటారు.

సుబ్బన్న యిల్లు బాగుచేయించుకుని చేరాడు. ఎన్నోసార్లు ఆతడు స్టేషనునుంచి కాలినడకను రావటంవల్ల కలిగిన యిబ్బందిని అనుభవించాడు. ఒక్కడికే యింత కష్టంగా ఉంటే ఆడవాళ్లతో, పిల్లలతో యిక్కడికి వచ్చేవాళ్లు ఎంతగా కష్టపడవలసి ఉంటుందో ఊహించాడు. తర్వాత కొద్ది రోజుల్లోనే తన దగ్గర ఉన్న డబ్బుతో ఒక మంచి ఎద్దును కొని బండిచేయించాడు. అప్పటినుంచి సంవత్సరాల తరబడి వూరినుంచి స్టేషనుకూ, స్టేషనునుంచి వూరికీ బండి తోలటమూ, యింట్లో ఉన్న కాస్సేపూ వండుకుని తినడమూ మొక్కలతో పనీ, అతని దినచర్యలలో ప్రాముఖ్యం వహించినై. రత్తమ్మ అతనికి మళ్లీ చాలాసార్లు కనిపించింది. ఆమె కిప్పుడు ముగ్గురు పిల్లలు. మొన్న పుట్టింటికి వచ్చినప్పు డామెను చూశాడు ఆమె చాలా బలహీనంగా ఉంది. అందమైన ఆమె మొహం రక్తవిహీనమై పాలిపోయి ఉంది. వీరన్న, చెల్లెలికి ఆ వూరి ఆచార్లుచేత ఏదో మందు యిప్పిస్తున్నాడు.

ఆలోచనల సుడిగుండంలో పడి మునకలు వేస్తున్న సుబ్బన్న అదిరిపడ్డాడు. పోర్టరు అతని వీపుమీద తట్టి "ప్యాసింజరు వస్తున్నది" అన్నాడు. సుబ్బన్న హడావిడిగా లేచి పైపంచె దులిపి భుజంమీద వేసుకున్నాడు. రైలప్పుడే కనుచూపు మేరలోకి వచ్చింది. స్టేషను మాస్టరు పోర్టరును కేకవేస్తూ యివతలికి వచ్చాడు.

రైలు ఒక్క నిముషంసేపు మాత్రమే ఆగింది. సుబ్బన్న అలా చూస్తూ నిలబడే ఉన్నాడు. రైల్లోనుంచి ఎవరూ దిగలేదు. ఒకాయన మాత్రం చేతిలో మరచెంబుతో కిందికి దిగివచ్చి 'ఇక్కడ మంచినీళ్లుండవా? పిల్లలు నీళ్లకోసం ఏడుస్తున్నారు" అన్నాడు. సుబ్బన్న చెంబు తీసుకుని మీ రెక్కండి బాబుగారూ! రైలెక్కువసేపు ఆగదు. నేను నీళ్లు పట్టి యిస్తాను లెండి" అంటూ పంపు దగ్గరికి వెళ్లి చెంబునిండా నీళ్లు పట్టి రైలు కదలబోతూ ఉండగా ఆయన చేతి కిచ్చాడు. రైలు కూతవేసి కదిలింది.

కొద్ది క్షణాల్లోనే మళ్లా అంతా నిరవమైపోయింది. ఎండ వేడిమి కొద్దిగా తగ్గింది. దూరంనుంచి సముద్రం గాలి వీచటం ప్రారంభించింది. సుబ్బన్న నెమ్మదిగా యివతలికి వచ్చి ఎద్దుమెడ లేపి బండి కట్టాడు. క్రింద మిగిలిన నాలుగు గడ్డిపరకలనూ తీసి బండిలో వేశాడు. పోర్టరు అతన్ని చూసి "యింటిదోవ పట్టావా? శుభం వెళ్లిరా!" అన్నాడు.

సుబ్బన్న ఒక్క గెంతు గెంతి బండిలో కూర్చొని ఎద్దు నదిలించాడు. ఆ ఎద్దు పేరు లచ్చి. సుబ్బన్న అదిలించగానే అది వేగంగా నడవటం ప్రారంభించింది.

సుబ్బన్న మళ్లీ ఆలోచనలో పడ్డాడు. తను పెద్దవాడైపోతున్నాడు. నిన్న సాయంకాలం హరికథ మొదలుపెట్టబోయే ముందు వీరన్న కనుపించి నిట్టూర్చి 'ఏమిటోరా' పెద్దవాళ్ల మైపో

# భ్రష్టయోగి

తున్నాం! నాకూ నెలరోజులనుంచీ దగ్గూ, లోజ్వరమూ. మా చెల్లెలి సంగతి నీకు తెలుసుగా వంట్లో రక్తమే లేదన్నాడు ఆచార్లుగారు. మందు తింటున్నది" అని చెప్పాడు నిజమే తను ఒంటరివాడు. తన కెవరూ లేరు. ఉన్నట్టుండి ఏ అర్ధరాత్రి వేళనో కన్ను మూస్తే! ఇంతవరకూ తా నెవరికీ ఏవిధంగానూ ఉపయోగపడలేదు. ఇంత జీవితమూ చాలా మామూలుగా గడిచిపోయింది. రోజు కున్న యిరవైనాలుగు గంటలలోనూ దాదాపు ఎనిమిది గంటలు—అంటే మూడోభాగం—నిద్రకిందనే గడిచిపోయింది. మిగిలిన రెండు భాగాలలోనూ ఒక భాగం పొట్టకూటికోసం శ్రమపడటంతో సరిపోయింది. మూడో భాగం కాలకృత్యాలు తీర్చుకునేందుకూ, తన ఇంటి పెరట్లో కూరపాదులకు సేవ చేసేందుకూ, ఎద్దుకు పరిచర్య చేసేందుకూ చెల్లిపోయింది.

"నీ వంటి పెద్దదొంగ నింత వరకూ చూడలేదు. నీ నిబ్బరం, అఘాయిత్యం..." అని జడ్జిగారంటూ ఉండగా దొంగ, మాటకి అడ్డువచ్చి "ఈ పొగడ్తలికి నేను లొంగనండోయ్!" అన్నాడు.

బండి నెమ్మదిగా సాగిపోతున్నది. పంటకాలవ వెనకబడిపోయింది. ఆకాశంలో మబ్బులు ఎర్రగా ఉన్నాయి. ఎవరో యిద్దరు వ్యక్తు లేదో మాట్లాడుకుంటూ నడిచిపోతున్నారు.

సుబ్బన్న చుట్టముట్టించాడు. అతనికి మరో విషయం గుర్తుకు వచ్చింది. తాను యుద్ధంలో పనిచేసే రోజులలో అప్పన్న అనేవా డొకడు ఉండేవాడు వాడికి చుట్టపొగ అసలు సరిపడేది కాదు. చుట్ట ముట్టించినప్పుడల్లా "ఒరే! సుబ్బన్నా! ఆ పొగ కొంచెం అటువైపు వూదు నాయనా! నీకు పుణ్యం ఉంటుంది" అంటూ ఉండేవాడు. వాడు నాలుగేళ్ల క్రితం ఎక్కడో కనిపించి, ఏదో గవర్నమెంటు ఆఫీసులో పంఖా లాగుతూ 'బతుకుతున్నా' నని చెప్పాడు.

బండి పొలిమేర దాటి వూళ్లో ప్రవేశించింది. సూర్యుడు అస్తమించినా యింకా కొద్ది వెలుగు ఉన్నది రత్తమ్మ అన్నగారి యింటిముందు నుంచుని పిల్ల లాడుకుంటూవుంటే చూస్తున్నది. సుబ్బన్న అటువైపొక్కసారి చూసి మళ్లీ తలవంచుకుని ఎద్దు నదిలించాడు మెళ్లో మువ్వలు 'గలగల'మని మోగుతూ వుండగా ఎద్దు వేగంగా నడుస్తున్నది.

సుబ్బన్న యిల్లు చేరుకునేసరికి వెలుగు క్రమంగా క్షీణిస్తున్నది. ఆకాశంలో నక్షత్రాలు నల్లని తివాచీమీద వెదజల్లబడిన రత్నాలవలె ప్రకాశిస్తున్నాయి.

అదొక పూరిల్లు. వాకిట విశాలమైన ఆవరణలో ఎన్నో రకాల కూరపాదు లున్నాయి. ఇంటి కప్పు నిండా దట్టంగా అల్లుకుని వున్నది సొరపాదు. కాయల బరువుకు కప్పు వంగిపోతున్నది. సుబ్బన్న ప్రతిరోజూ రెండో మూడో కాయలు కోసి ఎవరో ఒకరి కిస్తూనే ఉంటాడు. మొట్టమొదటి సారిగా కాచిన కాయను మాత్రం కోయకుండా ముదరబెట్టి గింజలకోసం వేరే ఉంచాడు. వాకిట్లో చిక్కుడుపాదుకు చక్కగా పందిరి వేశాడు. రెండు మూడు రోజుల కొకసారి బుట్టెడు కాయలు కోసి వాళ్లకూ వీళ్లకూ యిస్తూ ఉంటాడు.

సుబ్బన్న ఎద్దును విప్పి చుట్టు పాకలో కట్టేసి దాని ముందింత గడ్డి పడేసి పెరట్లోకి వెళ్లి కాళ్లూ, చేతులూ, మొహమూ కడుక్కున్నాడు. తర్వాత యింటి తాళం తీసి జేబులో ఉన్న అగ్గిపెట్టెతో గూట్లో ఉన్న బుడ్డిదీపం ముట్టించాడు. రెండు మూడు రోజుల క్రితమే అలకబడిన ఆ మట్టి యింట్లో దీపపు వెలుగు మందంగా వ్యాపించింది.

సుబ్బన్న బనీను జేబులోనుంచి ఒక బేడ నాణెం తీశాడు. అది అతని ఆనాటి సంపాదన. అంత తక్కువ రాబడి ఈమధ్య ఎప్పుడూ లేదు. అతడు తలపంకిస్తూ 'ఇవాళ బయల్దేరిన వేళ మంచిదికాదు.' అనుకుని యింట్లో మూలగా ఉన్న ఒక చెక్కను తొలగించి నేల లోపల ఉన్న ఒక కొయ్యపెట్టెను తెరిచాడు. అందులో ఒక కుండలో ఆ బేడ నాణెం పడేసి మళ్లీ యథాప్రకారం మూత వేసి యివతలికి వచ్చి వంట ప్రయత్నం మొదలుపెట్టాడు.

ఆ కుండలో దాదాపు పది పన్నెండేళ్లనుంచీ అతడు సంపాదించిన డబ్బంతా ఉంది. అంతా చిల్లర. అతనికి కాయితపు ముక్కలమీద నమ్మకం లేదు. "ఏ చెదలో పట్టి నాశనమైపోతాయి" అనుకునేవాడు. అతని అవసరాలకు పోను రాబడిలో చాలాభాగం మిగిలేది. ఎంత మిగిలితే అంత ప్రతి రోజూ ఆ కుండలో వేశాడు. చిల్లరతో ఆ కుండ దాదాపు నిండినట్టే. ఇవాళ్టిలాగా ఒక బేడ డబ్బులు మాత్రమే దొరికిన రోజులూ ఉన్నాయి. బాగా బేరం తగిలి రెండేసి రూపాయల చొప్పున చిల్లర దొరికిన రోజులూ వున్నాయి

సుబ్బన్న కుండలో బియ్యం పోసి పొయ్యిమీద ఉంచి, పుల్లలతో మంట చేశాడు. అన్నం ఉడుకు పట్టింది. పొయ్యి వెలుగు ఆ చిన్న గదిలో మట్టి గోడలకు బంగారంపూత వేస్తున్నది. సుబ్బన్న పుల్లలను పైకి తోస్తూ ఆలోచిస్తున్నాడు. క్రిందటి రాత్రి ఆ వూళ్లో ఎవరో ఒకాయన హరికథ చెప్పాడు. సుబ్బన్న సాధారణంగా ఎక్కడికీ కదిలే రకం కాదు. అయినా నిన్నటి రాత్రి నిద్ర పట్టలేదు. అందువల్ల ఎక్కడికి వెళ్లలేదు. వంటినిండా దుప్పటి కప్పుకుని కూర్చుని సుబ్బన్న కథ విన్నాడు. అదొక భక్తుడి కథ. ఆ భక్తుడు మొదట్లో పరమ దుర్మార్గుడు. కిరాతకపు పనుల వాడికి ఆనందం కలిగించేవి. కనిపించినవారి నందర్నీ

హింస పెట్టేవాడు. దోవలు కొట్టి పొట్టపోస్సు కునేవాడు. అటువంటి నీచుడు ఒక బాటసారి వల్ల జ్ఞానం పొంది పూర్తిగా మారిపోయాడు. తాను ఏ బాటలో నిస్సహాయులైన బాటసారులను దోచుకొని నానా బాధలూ పెట్టాడో, ఆ బాట మీదనే ఒక చిన్న పందిరి వేసుకుని కుండలనిండా చల్లని నీళ్ళు ఉంచుకుని దాహంగొన్న బాటసారులకు నీళ్లివ్వటం ప్రారంభించాడు. అతడు కాలం గడిచేకొద్దీ పండిన ఆకువలె తయారై చివరకు ఒకనాటిరాత్రి ప్రాణం విడిచాడు. అతనికోసం ప్రత్యేకంగా ఒక విమానం వచ్చి అతన్ని వైకుంఠానికి తీసుకుపోయింది.

ఈ కథ సుబ్బన్నకు బాగా నచ్చింది. అతడనుకున్నాడు. తను పెద్దవాడయిపోయినాడు. రాత్రి హరికథలో ఆయన చెప్పిన మృత్యు లక్షణాలలో కొన్ని అప్పుడే కనిపిస్తున్నాయి. 'నా' అనుకోదగినవారెవరూ లేరు. చస్తే వూళ్లో నలుగురూ చేరి తగలబెట్టి ఒక్కసారి నిట్టూర్చి వూరుకుంటారు. తర్వాత యీ స్థలమూ, పాకా, బండీ ఎద్దూ అన్నీ పరుల పాలైపోతాయి. తనను మళ్లీ ఎవరూ తలచుకోవలసిన అవసరమే లేదు. మహా అయితే 'ఇంట్లో రకరకాల కూరపాదులు వేసి ఏ ఋతువులో కాచే కాయగూరలను ఆ ఋతువులో పండించి అప్పుడప్పుడు మనకు యిస్తూవుండేవాడు' అని ఏ ఒకరో, యిద్దరో అనుకుంటారేమో!

సుబ్బన్న కుండను దింపి పొయ్యి ఆర్పివేసి బయటికి వచ్చాడు. దీపం దగ్గరగా కూర్చుని చుట్టచుట్టుకుంటూ మళ్లీ ఆలోచనలో పడ్డాడు. ఆ చిల్లర ఎంతవుందో తనెప్పుడూ లెక్కపెట్టలేదు. అయినా ఎంత లేదన్నా ఏ మూడు వందలరూపాయలో వుండకపోదు. తానొకవేళ యింతకుముందు అనుకున్నట్టు కన్ను మూయ్యటం జరిగితే అంతా నేలపాలే. మహా అయితే తర్వాత ఎన్నాళ్ళకో ఎవరికో దొరుకుతుంది. ప్రస్తుతానికి ఎవరికీ అక్కడ చిన్న నేలమాళిగ ఉన్నట్టూ అందులో డబ్బుతో నిండిన కుండ ఉన్నట్టూ తెలిసే అవకాశం లేదు. దీన్నంతటినీ ఏమి చేసేట్టు?

సుబ్బన్న తర్వాత పరధ్యానంగానే భోజనం ముగించాడు. అన్నం చాలా మిగిలిపోయింది. గిన్నె మీద మూత ఉంచి ఆ చోటు నీళ్లతో శుభ్రం చేసి అతడు బయటికి వచ్చి ఆరు బయట కుక్కిమంచం వాల్చుకుని యింట్లోనుంచి పక్కగుడ్డలు తెచ్చి పరుచుకుని కూర్చున్నాడు.

తూర్పున సప్తర్షిమండలం మెరుస్తున్నది. పౌర్ణమి వెళ్లిన ఆరో రోజు. చంద్రుడు, కొద్దిగా కొరికి పారేసిన వెన్నముద్దవలె ఉదయిస్తున్నాడు. చంద్రబింబం పక్కనే ఒక నక్షత్రం మహా శోభతో ప్రకాశిస్తున్నది.

సుబ్బన్నకు ఏదో స్ఫురణకు వచ్చి తల పంకించి "బాగా గుర్తుకు వచ్చింది. అలా చేస్తే బాగానే ఉంటుంది. పొద్దున్నే ఆ మూల కాసిన సొరకాయ తీసుకుని యీ చిల్లర అంతా మూట గట్టుకుని ఆయన దగ్గరికి వెళ్లాలి" అనుకున్నాడు. అతనికి గుండెలమీదినుంచి ఏదో బరువు దింపినట్టయింది. తర్వాత మరికొద్ది సేపటిలోనే హాయిగా వీస్తున్న చల్లనిగాలికి అతనికి నిద్ర ముంచుకు వచ్చింది.

తెలతెలవారుతూ ఉండగా అతనికి మెలకువ వచ్చింది. రకరకాల పక్షులు రకరకాలుగా అరుచుకుంటూ అన్ని దిక్కులా ఎగిరిపోతున్నాయి. సుబ్బన్న లేచి కాల్యాలన్నీ తీర్చుకుని చన్నీళ్లలో ప్రతిరోజు వలెనే స్నానం చేసి క్రితం రాత్రి నిర్ణయించుకున్న ప్రకారమే సొరకాయ కోసుకుని కుండలో ఉన్న చిల్లర అంతా మూట కట్టుకుని బయల్దేరాడు.

అతడు బయలుదేరింది ఆ వూరి కరణంగారి యింటికి ఆయన పేరు ఆదినారాయణ. ఆయన కొన్నాళ్ళ క్రితమే నలుగురితోనూ "మన వూళ్లో ఒక స్కూలు ఉండితీరాలి. మన పిల్లలు చదువు కోసం రోజూ రెండు మైళ్ళు నడిచిపోవటం ఏమీ బాగాలేదు. మీరు యథాశక్తిగా తోడ్పడితే నేను ప్రభుత్వంతో సంప్రదించి మరి కొంత సహాయం రాబట్టగలను" అన్నాడు. అందుకు నలుగురూ సమ్మతించి శాయశక్తులా తోడ్పడ్డారు. మరి కొన్నాళ్లకే ఆ ఏర్పాట్లన్నీ పూర్తి కాగలవని ఆయన ప్రభుత్వంతో సంప్రదించిన మీదట అందరికీ చెప్పాడు.

ఆయన పంచలో కూర్చునివుండి సుబ్బన్నను చూసి "ఏం సుబ్బన్నా! మీ సొరచెట్టు కాపు ఉడిగిపోలేదూ? నీ చేతు లేం చేతులోగాని కాలం గాని కాలంలో గూడా మీ యింట్లో కాపు ఉంటుం దేమిటోయ్" అన్నాడు.

సుబ్బన్న సొరకాయను ఆయన పక్కనే ఉంచి 'చేతుల్లో ఏముంది బాబుగారూ! అంతా ఆ భూదేవి చలవ" అన్నాడు. ఆయన మళ్లీ "ఆ మూటేమిటి? చిక్కుడుకాయలు కూడా తెచ్చినట్టున్నావే" అన్నాడు. సుబ్బన్న అటూ యిటూ చూసి "కాదు బాబుగారూ! మీ రట్టా ముందు గదిలోకి రండి. చిన్న మనవి చేసుకుంటాను" అని జవాబిచ్చాడు. ఆయన లేచి ముందు గదిలోకి వచ్చాడు. సుబ్బన్న ఆ మూటను బల్లమీద ఉంచి కొద్దిగా కంపిస్తున్న కంఠస్వరంతో అంతా చెప్పాడు. "దీన్ని ఏదో మీకు తోచినట్టుగా వినియోగం చెయ్యండి. ముసలిముండావాణ్ణి. ఎప్పుడేమవుతుందో చెప్పలేముగదా బాబుగారూ" అన్నాడు అతని గొంతు గద్గదికమయింది. పై పంచెతో కళ్లద్దుకుని యింక మాట్లాడలేక "నేను వెళ్తాను బాబుగారూ!" అంటూ అక్కడ ఒక్క క్షణం కూడా నిలబడకుండా త్వరత్వరగా నడిచి వెళ్లిపోయాడు.

ఆయన కొద్ది క్షణాలు నోట మాట లేకుండా ముగ్ధుడై నిలబడిపోయాడు. తర్వాత తేరుకుని ఆ మూట ముడి విప్పి చిల్లర నంతటినీ బల్ల మీద పోశాడు. వెంటనే ఆయన శిలాప్రతిమవలె చేష్టలుడిగి అప్రతిభుడై చేత్తో నుదుటిమీద కొట్టుకుని దీనంగా 'అయ్యో' అనుకున్నాడు. ఆ చిల్లర అంతా ఒక వెయ్యేళ్ల క్రిందట ప్రభుత్వమువారు వాడకంలోంచి రద్దుచేసిన పచ్చ బేడలూ అణాలూ అర్ధణాలూను! కొన్ని తెల్లని బేడలున్నాయి. అక్కడక్కడ మాత్రం కొన్ని పావలా బిళ్లలూ, తెల్ల అణా బిళ్లలూ ఉన్నాయి. మొత్తానికి ఆ డబ్బులో దాదాపు తొంభై శాతం చెల్లదన్నమాటే.

ఆయన వాకిట్లోకి వచ్చి చూశాడు. దూరంగా నిబ్బరంగా అడుగులు వేస్తూ, మహదానందంతో తేలికపడిన మనస్సుతో నడిచిపోతున్నాడు బండి సుబ్బన్న. ★

## 'మధ్యేమధ్యే పానీయం'

ఒకానొక ఇల్లు జప్తు చెయ్యడానికి వచ్చిన ఆఫీసరు గుమాస్తాని ఇంటిలోకి పంపి ఆ యింట్లో ఉన్న వస్తువులజాబితా వ్రాయమని చెప్పి తను వీధి గుమ్మంలో కూచున్నాడు. వస్తువుల జాబితా వ్రాస్తున్న గుమాస్తాకు ఒకబల్లపై బ్రాందీ బుడ్డీ గ్లాసు కనబడ్డాయి. వెంటనే నోరూరి ఒక గ్లాసు వేసుకున్నాడు. మళ్ళీ జాబితా వ్రాయడం ప్రారంభించేడు. కొంతసేపు అయ్యాక అతని దృష్టి మళ్ళీ బ్రాందీ బుడ్డీపైకి పోయింది. మరో గ్లాసు వేసుకొని తనపని కొనసాగించేడు. "ఏమి చెప్మా ఇంతసేపయింది, వస్తువుల జాబితా ఇంకా పూర్తికాలేదని కాబోలు" అనుకుంటూ ఆఫీసరు లోపలి కెళ్లేసరికి గుమాస్తా నేలమీదపడి ఉన్నాడు. అతని ప్రక్కనేపడి ఉన్న జాబితాలో ఆఖర్న వ్రాసి ఉన్నది ఇది:

గిరగిరతిరిగే తివాసీ ఒకటి.

ఎ. వి. ఎస్. రావు (విశాఖపట్నం)